
క్లుప్తంగా

నేడు నూకాలమ్మ తీర్థం


సిరిపురంలోని నూకాలమ్మ అమ్మవారు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో సోమవారం నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

300 మంది వలంటీర్ల రాజీనామా


వి.కొత్తూరులో రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు

తుని రూరల్: నిస్వార్థంగా నాలుగున్నరేళ్లగా అందిస్తున్న సేవలను నిలిపివేయడం అన్యాయమంటూ వి.కొత్తూరు, హంసవరం గ్రామాలకు చెందిన వలంటీర్లు ఆదివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వి.కొత్తూరులో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ ఆధ్వర్యంలో వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రాజబాబుకు అందజేశారు. వీటితో మండలంలో రాజీనామాలు చేసిన వలంటీర్ల సంఖ్య 300కు చేరింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో 449 మంది వలంటీర్లను నియమించారు.

ఆర్‌పీఐ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షురాలిగా నందిని

జగ్గంపేట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షురాలిగా ఉల్లం నందినిని నియమించినట్టు ఆ పార్టీ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్ తెలిపారు. జగ్గంపేటలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిన ఆర్‌పీఐ మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉల్లం నందిని మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణకు కృషి చేస్తానన్నారు. తనను ఆర్‌పీఐ మహిళా అధ్యక్షురాలిగా నియిమించిన పులి ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా నాయకులు కొత్తపల్లి సూరిబాబు, మహిళా నాయకులు సత్యవతి, చిన్నయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పచ్చ కండువాలు కప్పినా తిరిగి వైఎస్సార్ సీపీలో చేరిక

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో కొందరిని టీడీపీ నేతలు బలవంతంగా తీసుకువెళ్లి పచ్చ కండువాలు కప్పినా వారు తిరిగి వైఎస్సార్ సీపీ గూటికి చేరినట్టు గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కొండేపూడి వీరబాబు, అతని బృందాన్ని శనివారం టీడీపీ నేతలు తీసుకువెళ్లి పచ్చ కండువాలు కప్పి పార్టీ నేతలుగా ప్రకటించారన్నారు. కాగా వారు ఆదివారం తిరిగి సొంత పార్టీ వైఎస్సార్ సీపీలో చేరగా కండువాలు వేసి ఆహ్వానించామని సుగణరావు తెలిపారు.

ఎన్నికల శిక్షణ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ: రానున్న ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు 12, 13 తేదీలలో జరగనున్న శిక్షణ ఏర్పాట్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం పరిశీలించారు. శిక్షణ జరిగే పీఆర్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి సందర్శించిన ఆయన చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

ఉపాధికి ఊతం

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.300కు చేరిన రోజు కూలి
- 14.67 లక్షల పని దినాల కల్పనే లక్ష్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న కూలీలు


ఎస్.చామవరం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తుని రూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే కూలి రేటు పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన కూలి రేట్లకు అనుగుణంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పర్యవేక్షణ అధికారులు సాఫ్ట్‌వేర్ అమర్చే పనుల్లో నిమగ్నమయ్యారు.

నియోజకవర్గంలో 83,761 మందికి జాబ్‌కార్డులు

తుని నియోజకవర్గంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 14,41,497 పని దినాలు లక్ష్యం కాగా కూలీలు 12,58,479 పని దినాలు పూర్తి చేశారు. 83,761 మందికి జాబ్‌కార్డులు ఉండగా 43,629 మంది పనులకు హాజరయ్యారు. వీరిలో 1,123 మంది వందరోజుల పని పూర్తి చేసుకున్నారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో మొత్తంగా రూ.40.56 కోట్ల విలువైన పనులు జరిగాయి.

పెరిగిన కూలి రేటు

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలను నివారించే లక్ష్యంతో 2009లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతి సంవత్సరం వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ.10 వేలు వేతనం లభించేలా ఈ పథకాన్ని రూపొందించారు. క్రమంగా కూలి రేటు పెరుగుతూ వచ్చింది. 2024 మార్చి 31 వరకూ రోజు కూలి రూ.272 ఉండగా ఏప్రిల్ ఒకటి నుంచి రూ.300లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో రోజుకూలి గరిష్ఠంగా రూ.300 లభించనుంది. ఫలితంగా మెటీరియల్ కాంపొండ్ పెరగనుంది.

2024-25 సంవత్సరపు లక్ష్యం : పెరిగిన కూలి రేట్లకు అనుగుణంగా పని దినాలు కల్పనకు జిల్లా అధికారులు మండలాలువారీగా లక్ష్యాలను నిర్దేశించారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో రూ.64.71 కోట్ల విలువచేసే 14.67 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. శరవేగంగా పనులు చేసేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 11.61 లక్షల (80శాతం) పని దినాలు పూర్తి చేయాల్సి ఉంది. 2024-25 సంవత్సరంలో కనీసంగా 1,510 మంది వందరోజుల పని పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు.

2024-25లో మొదట మూడు నెలల లక్ష్యం

మండలం	పని దినాల లక్ష్యం	ఏప్రిల్	మే	జూన్	వంద రోజుల లక్ష్యం
తుని	640000	135000	162000	162000	550 మంది
తొండంగి	312000	78000	93600	93600	300 మంది
కోటనందూరు	515000	128750	154500	154500	660 మంది

2023-24 సంవత్సరంలో లక్ష్యాలు, ప్రగతి

మండలం	పని దినాల లక్ష్యం	పూర్తయిన పనిదినాలు	మొత్తం కూలీలు	పనిచేసిన కూలీలు	100 రోజులు చేసిన కూలీలు	వ్యయం (రూ.లక్షల్లో)
తుని	630000	527727	29911	16917	404	రూ.1563.54
తొండంగి	309000	271650	30949	11654	166	రూ.1043.99
కోటనందూరు	502497	459102	22901	15058	553	రూ.1448.95
మొత్తం	14,41,497	12,58,479	83,761	43,629	1,123	రూ.4056.48

వందరోజుల పని పూర్తి చేశా



గడిచిన ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేశాను. రోజు కూలి రూ.300కి పెగడం ఆనందంగా ఉంది. ఈ సంవత్సరం వంద రోజులు పనిదినాలను పూర్తి చేస్తాను. పెరిగిన కూలి రేటుతో లబ్ధి పొందుతాను.

– కోటంస్వామి పోతురాజు, ఉపాధి కూలీ, డి.పోలవరం

సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నాం



రోజుకూలి రూ.300లకు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. అందుకు అనువైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేస్తున్నాము. ఈ సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేస్తాము. ఉగాది తర్వాత కూలీల సంఖ్యను పెంచి పనులు వేగవంతం చేస్తాము.

– పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘానికి రూ.5 లక్షల విరాళం


సీమాంధ్ర బీసీ సంఘానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న బులిరాజు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ఆ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్ల బులిరాజు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులకు ఆదివారం చెక్కు అందజేశారు. స్థానిక సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బులిరాజు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిలో 20 ఎకరాలను నిరుపేదలకు ఒక్కొక్కరికీ సెంటు వంతున నివాస స్థలాలుగా పంపిణీ చేసేందుకు నిర్ణయించామన్నారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం అభివృద్ధికి బులిరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆ సంఘ జిల్లా కార్యదర్శి ముచ్చి అప్పలరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి ముచ్చర్ల శ్రీనివాసు, కోసూరి లక్ష్మీనారాయణ కొనియాడారు. అనంతరం సంఘ సభ్యులు కుర్ల బులిరాజును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు యడ్ల వీరాస్వామి, సంఘ నాయకులు ఒమ్మి గంగరాజు, దొడ్డి శ్రీనివాసు, కిలపర్తి శ్రీనివాసరావు, పెండ్యాల శివశంకర్, సోర్నపూడి కోటేశ్వరరావు, మెలిపాక నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక

- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- గ్రామంలో ఎన్నికల ప్రచారం


పోతులూరులో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు గ్రామానికి చెందిన 100 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నేత శెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదప్రజల జీవన ప్రమాణ స్థాయి పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు.

ఇంటింటా ప్రచారం

మండలంలోని పోతులూరులో ఆదివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. మరో అవకాశం ఇస్తే ప్రజలకు మరింత మేలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథకంలో నడిపిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, పంచాది రాంమూర్తి, రేఖా దేవుడు, నూకలబంతి చక్రం, ఎలుగుబంటి నూకరాజు, కంచూరి సత్యనారాయణ, దేవరపు నాగబాబు, చిన్నం సూర్యకాంతం, కట్టిమూరి మరియమ్మ, ఇనకోటి బుల్లమ్మ, కళా సుభద్ర, వాసశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఘన స్వాగతం


యూజేపురంలో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు పలివెల నాగేంద్ర, కాకరాపల్లి లోవదుర్గ జడ్డంగి అన్నవరం నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండలంలోని యూజే పురం చేరుకుంది. పాదయాత్రకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఘన స్వాగతం పలికారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- జి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం


జి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ ఈగల విజయదుర్గ, ఎంపీటీసీ దడాల సతీష్, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, పార్టీ నాయకులు యడ్ల సత్యనారాయణ, కోన దాసు, కింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, ఆచంట వెంకటేశ్వరావు, పర్వత వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


బలభద్రపురంలో బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగ్గంపేట: మండలంలోని బలభద్రపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గోపిశెట్టి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం పరామర్శించారు. పార్టీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5వేలు, 100 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చీపురుపల్లి రాఘవ, అబ్బిరెడ్డి వీరబాబు, పడాల రాజశేఖర్, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, అడ్డాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ
- బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం


బూరుగుపూడిలో ప్రచారం చేస్తున్న తోట రాంజీ

కిర్లంపూడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని బూరుగుపూడిలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నేత పాతంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవేనన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు వచ్చే ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, ఆశపు బద్రి, వైస్ ఎంపీపీ పాతంశెట్టి సత్యవతి, కర్రి నారాయణమూర్తి, బత్తుల వెంకటమణమూర్తి, పట్టెం శ్రీరాములు, పాతంశెట్టి సూరిబాబు, కొల్లుమల్ల సత్తిబాబు, దేవాది శ్రీను, కొవ్వూరి లోవరాజు, కర్రి సూరిబాబు, దొమాల గంగాధర్, దాడి చినబుజ్జి, అడబాల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

గోకవరం: మండలంలోని గాదెలపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు ఇజ్జిన ఏసురత్నం ఆదివారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు తోట నరసింహం పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- జె.అన్నవరంలో ఎన్నికల ప్రచారం


జె.అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, కోరాడ శ్రీను, కొండపల్లి బాబీ, ఎస్.కృష్ణ, లోగీసు రాజు, సోమన్నదొర, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజాసంక్షేమం


గోకవరం మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎన్నికల ప్రచారం

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ఓట్లను అభ్యర్థించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, రౌతు జోగేశ్వరరావు, నందూరి గంగారావు, సుంకర వెంకటరమణ, సోషల్ మీడియా కో కన్వీనర్ ఇజ్జిన కిరణ్, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు పాల్గొన్నారు.

నూకాలమ్మ తిరునాళ్లు ప్రారంభం


ఏవీ నగరంలో గంగాలమ్మకు పూజలు చేసిన భక్తులు


కిర్లంపూడిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన నూకాలమ్మ ఆలయం

కిర్లంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని కిర్లంపూడిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్లు ఆదివారం వైభంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గత నెల రోజులుగా గ్రామ వీధుల్లో గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా ఆలయం ఎదుట చలువ పందిరి వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు రోజుల పాటు తీర్థం నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మవారికి సారె సమర్పణ

కిర్లంపూడి ఏనుగు వీధిలో వేంచేసిన కన్యాకా పరమేశ్వరి ఆలయం నుంచి ఆదివారం భక్తులు ఊరేగింపుగా వచ్చి నూకాలమ్మ అమ్మవారికి సారె సమర్పించారు.

కొత్త అమావాస్య ఉత్సవాలకు ఏర్పాట్లు

తుని రూరల్: కొత్త అమావాస్యను పురస్కరించుకుని గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు గ్రామాల్లో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.అన్నవరంలో మెయిన్‌రోడ్డును ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. రేఖవానిపాలెం, డి.పోలవరం, తేటగుంట, వల్లూరు, హంసవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ తల్లి విగ్రహాలకు, ఆలయాలకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నూకాలమ్మతల్లిని దర్శించేందుకు ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. అమావాస్య మరుసటి రోజు ఈ నెల 9న ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు రామాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. రాపాక, కేఓ.మల్లవరం, టి.తిమ్మాపురం, ఎన్.చామవరం, వి.కొత్తూరు, ఎన్ఎస్‌వీ నగరం, చేపూరు, ఎన్.సూరవరం, దొండవాక, కొలిమేరు, ఎస్.అన్నవరం ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

గంగాలమ్మ జాతర

తొండంగి: కొత్త అమావాస్య సందర్భంగా ఏవీ నగరంలో గంగాలమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని వెయ్యి మంది మహిళలు పసుపునీటి బిందెలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. నెలరోజుల పాటు ఘనంగా జరిగిన వేడుకల్లో భాగంగా ఆఖరిరోజు సిరిమానోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శృంగవృక్షంలో నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ఎస్.అన్నవరంలో కొత్తఅమావాస్య ఉత్సవాలకు ముస్తాబైన నూకాలమ్మ ఆలయం

ఏలేరులో మృతదేహం లభ్యం

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లి ఏలేరు కాలువలో గ్రామంలో పేపర్‌గ్లాసులు ఏరుకునే రమణ (55) అనే అనాథ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వెలుగుల సురేష్ తెలిపారు. పంచాయతీ అధికారుల సమాచారం మేరకు అధికారులు, గ్రామ సర్పంచ్‌ల సమక్షంలో అనాథ శవాన్ని పంచాయతీ సిబ్బంది ఖననం చేసినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

మండలంలోని కట్టమూరు పుంతలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.